సాక్షి
పశ్చిమగోదావరి

బుధవారం । 28 । ఆగస్టు । 2024



హత్యాచారాలపై ఆగ్రహ జ్వాల

కోల్‌కతాలో వైద్య విద్యార్థినిపై హత్యాచార ఘటనను నిరసిస్తూ ఏలూరులో విద్యార్థినులు భారీ ర్యాలీ, నిరసన ప్రదర్శనలు నిర్వహించారు. 8లో ▸



తస్మాత్ జాగ్రత్త

పొలాల్లో పురుగు మందుల పిచికారీ విషయంలో రైతులు జాగ్రత్తలు పాటించాలని వ్యవసాయాధికారులు సూచిస్తున్నారు. 8లో ▸



పంచలోహ విగ్రహం చోరీ

ఆగిరిపల్లిలోని వ్యాఘ్ర లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో స్వామివారి పంచలోహ విగ్రహం మంగళవారం చోరీకి గురైంది. 8లో ▸



కఠినమైన శిక్షలు విధించాలి



ప్రజల ప్రాణాలు కాపాడే డాక్టర్లవి కూడా ప్రాణాలే. డాక్టర్లకే రక్షణ లేకపోతే విధులు నిర్వహించలేని పరిస్థితులు తలెత్తుతాయి. డాక్టర్లకు సమగ్ర రక్షణ కల్పించాలి. ఇందుకోసం కఠినమైన చట్టాలు రూపొందించి శిక్షలు అమలు చేయాలి. ముఖ్యంగా మహిళ వైద్యుల భద్రతపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పటిష్టమైన చర్యలు **తీసుకోవాలి.**

– డాక్టర్ కరీముల్లా, వైద్యాధికారి, రమణక్కపేట పీహెచ్‌సీ ముసునూరు మండలం

సెంట్రల్ ప్రొటెక్షన్ యాక్ట్ అమలు చేయాలి



కోల్‌కతాలో వైద్యురాలిపై హత్యాచార ఉదంతం తీవ్రంగా కలచివేసింది. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా మన రాష్ట్రంలో మహిళా వైద్యుల భద్రత కోసం ఆస్పత్రి వద్ద పోలీసుల రక్షణతో పాటు అన్ని రకాల వసతులు కల్పించాలి. డ్రెస్సింగ్ రూమ్, రెస్ట్ రూములను ప్రత్యేకంగా ఏర్పాటు చేయాలి. మహిళా వైద్యుల రక్షణకు సెంట్రల్ ప్రొటెక్షన్ **యాక్టును వెంటనే అమలు చేయాలి. మహిళా వైద్య సిబ్బందికి ధైర్యాన్ని కల్పించాలి**

– జి.దయామణి, వైద్యురాలు, తుందుర్రు పీహెచ్‌సీ

న్యూస్‌రీల్

శ్రీవారి క్షేత్రంలో కృష్ణాష్టమి శోభ



సప్తగోకులంలోని శ్రీకృష్ణునికి హారతులిస్తున్న పురోహితులు

ద్వారకాతిరుమల: చినవెంకన్న దివ్యక్షేత్రంలో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు మంగళవారం నేత్రపర్వంగా జరిగాయి. కొండపైన గోసంరక్షణశాలలో, అలాగే ఆలయ తూర్పు ప్రాంతంలోని సప్తగోకులంలో పెద్ద ఎత్తున భక్తులు గోవులకు పూజలు నిర్వహించారు. అనంతరం వాటికి దాణాను అందించారు. ఈ సందర్భంగా సప్తగోకులంలో కొలువైన శ్రీకృష్ణుడికి పురోహితులు పూజాధికాలను జరిపి, హారతులిచ్చారు. కృష్ణాష్టమి సందర్భంగా ఆలయంలో రద్దయిన నిత్యార్జిత కల్యాణాలు, ఆర్జిత సేవలు బుధవారం నుంచి యధావిధిగా జరుగుతాయని, భక్తులు గమనించాలని దేవస్థానం ఈఓ వేండ్ర త్రినాథరావు సూచించారు.

నేడు క్షేత్రంలో ఉట్లు పండుగ

శ్రీకృష్ణ జన్మాష్టమి మరుసటి రోజు క్షేత్రంలో ఉట్లు పండుగను జరపడం ఇక్కడ సంప్రదాయంగా వస్తోంది. ఈ క్రమంలోనే బుధవారం సాయంత్రం శ్రీవారి క్షేత్రంలో ఉట్లు పండుగను వైభవంగా జరుపనున్నట్టు ఆలయ ఈఓ వేండ్ర త్రినాథరావు తెలిపారు. అందులో భాగంగా ఉభయ దేవేరులతో శ్రీవారు క్షేత్ర పురవీధుల్లో ఊరేగుతారని, యావన్మంది భక్తులు ఈ వేడుకల్లో పాల్గొనాలని ఈఓ కోరారు.

రేపు తణుకులో 2కే రన్

తణుకు అర్బన్: జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో తణుకులో గురువారం 2కే రన్ నిర్వహిస్తున్నట్లు అసోసియేషన్ కార్యదర్శి సంకు సూర్యనారాయణ మంగళవారం తెలిపారు. స్థానిక శ్రీచిట్టూరి ఇంద్రయ్య ప్రభుత్వ డిగ్రీ కళాశాల క్రీడా ప్రాంగణంలో ఉదయం 7గంటలకు నిర్వహించే 2కే రన్‌కు సంబంధించి అండర్-12, 14, 17, 20 విభాగాల్లో బాలురు, బాలికలు, పురుషులు, స్త్రీలు విభాగాల్లో నిర్వహించనున్నామన్నారు. విజేతలైన క్రీడాకారులకు బహుమతులు అందజేస్తామని చెప్పారు. పోటీల్లో పాల్గొనే క్రీడాకారులు మరిన్ని వివరాల కోసం 99893 63978, 82472 60545 ఫోన్ నంబర్లలో సంప్రదించాలని కోరారు.

అర్జీదారులకు నాణ్యమైన పరిష్కారం చూపాలి



కలెక్టర్ నాగరాణి

భీమవరం (ప్రకాశంచౌక్): అర్జీదారులకు నాణ్యమైన పరిష్కారం చూపాలని కలెక్టర్ చదలవాడ నాగరాణి జిల్లా అధికారులకు సూచించారు. మంగళవారం స్థానిక కలెక్టరేట్‌లో వివిధ శాఖల జిల్లా అధికారులతో మీకోసం పీజీఆర్ఎస్ అర్జీల పరిష్కారంపై ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించి సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సాధ్యమైనంత వరకు అర్జీదారుని సమస్యను మేలైన రీతిలో పరిష్కరించాలన్నారు. ప్రభుత్వం పీజీఆర్ఎస్‌పై ప్రత్యేక దృష్టి సారించిందని, సకాలంలో స్పందించి అర్జీదారులకు నాణ్యమైన పరిష్కారం చూపాలన్నారు. అర్జీలో పేర్కొన్న అంశంలోని ప్రాధాన్యతను బట్టి 24 గంటల నుంచి 120 రోజుల లోపు పరిష్కరించేందుకు షెడ్యూల్ సమయం నిర్ణయించారన్నారు. చివరి నిమిషం వరకు వేచి చూసే ధోరణి విడనాడి నిర్ణీత గడువులోగా పరిష్కారానికి చర్యలు తీసుకోవాలన్నారు. నిర్ణీత గడువు దాటితే సంబంధిత బాధ్యులపై చర్యలు ఉంటాయన్నారు. ప్రతి ఫిర్యాదును క్షుణ్ణంగా చదివి అదనపు సమాచారం అవసరమైతే అర్జీదారులని ఫోన్‌లో సంప్రదించి మాట్లాడాలన్నారు. నిర్లక్ష్యంగా ఏదోక సమాధానం ఇస్తే మళ్లీ రీ ఓపెన్ అవుతాయని, దానికి సంబంధిత అధికారే బాధ్యత వహించాల్సి ఉంటుందని హెచ్చరించారు.

పీఎఫ్ చందాదారుల బ్యాలెన్స్ షీట్‌ల అందజేత

ఏలూరు (మెట్రో): ఉమ్మడి జిల్లా పరిషత్‌లోని జెడ్పీ భవిష్య నిధి చందాదారుల 2020-24 ఆర్థిక సంవత్సరాలకు చెందిన జమ, ఖర్చుల బ్యాలెన్స్ షీట్‌లను డీడీవో కార్యాలయాలకు పంపించినట్లు జెడ్పీ సీఈవో కేఎస్ఎస్ సుబ్బారావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. అదేవిధంగా 2018-19, 2019-20 ఆర్థిక సంవత్సరాల రివైజ్డ్ బ్యాలెన్స్ షీట్‌లను సైతం పంపించామన్నారు. బ్యాలెన్స్ షీట్‌లు అందని చందాదారులు హెల్ప్‌డెస్క్ ద్వారా సమాచారం పొందవచ్చని, బ్యాలెన్స్‌షీట్‌లపై అభ్యంతరాలు ఉంటే ఆగస్టు 31లోగా సంబంధిత డీడీవోల ద్వారా తెలియజేయాలని సూచించారు.

అటకెక్కిన సురక్ష

గత ప్రభుత్వంలో

ప్రజారోగ్యానికి పెద్దపీట వేసిన ఆరోగ్య సురక్షను కూటమి ప్రభుత్వం అటకెక్కించింది. పేదలకు సూపర్ స్పెషాలిటీ వైద్యసేవల్ని చేరువ చేసిన ఈ వైద్య శిబిరాల నిర్వహణను గాలికొదిలేసింది. చెంతకు వచ్చి అందించే ఉచిత వైద్య పరీక్షల ఊసే లేదు. రోగం నయం అయ్యేంత వరకు చేయూతనివ్వాలన్న సురక్ష ఆశయం నీరుగారిపోతుండగా వైద్యం కోసం ఆస్పత్రికి రావాల్సిందేనన్న చందాన ప్రస్తుత పరిస్థితి తయారైంది.

- ఆరోగ్య శిబిరాల నిర్వహణ ఊసెత్తని కూటమి సర్కారు
- వైద్య సేవల కోసం రోగుల ఇక్కట్లు
- వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో పేదల ఆరోగ్యానికి భరోసా
- జగనన్న ఆరోగ్య సురక్షతో ప్రజల చెంతకే కార్పొరేట్ వైద్యం
- జిల్లాలో 447 శిబిరాల ద్వారా 3.54 లక్షల మందికి వైద్యసేవలు
- 14 రకాల వైద్య పరీక్షలు, అందుబాటులో 172 రకాల మందులు
- ఎన్నికల అనంతరం కూడా కొనసాగిన శిబిరాలు
- కొత్త ప్రభుత్వంలో నిలిచిన వైద్య శిబిరాల నిర్వహణ



జగనన్న ఆరోగ్య శిబిరంలో వైద్యసేవలు పొందుతున్న ప్రజలు (ఫైల్)

సాక్షి, భీమవరం: విద్య, వైద్యం ప్రజల హక్కుగా భావించిన గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వాటికి అధిక ప్రాధాన్యమిచ్చింది. నిరుపేద, మధ్యతరగతి కుటుంబాల ప్రజలకు ఉచిత వైద్యసేవలను అందించి మానవీయ దృక్పథంతో ముందుకు సాగింది. రాష్ట్రంలో ప్రతి ఇంటినీ జల్లెడ పట్టి ప్రజల ఆరోగ్య సమస్యలు, అవసరాలను గుర్తించి పరిష్కరించేలా జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం చేపట్టింది. వైద్య సిబ్బంది, వలంటీర్లు ఇంటింటికీ వెళ్లి బీపీ, షుగర్, హిమోగ్లోబిన్, అవసరాన్ని బట్టి మలేరియా, డెంగీ, కఫం పరీక్షలు నిర్వహించి ఆరోగ్య సమస్య ఉన్న వారిని గుర్తించారు. పీహెచ్‌సీలు, యూపీహెచ్‌సీలు, విలేజ్ క్లినిక్‌లు పరిధిలో వైద్యశాఖ షెడ్యూల్ ప్రకారం శిబిరాలు నిర్వహించింది. ప్రతి శిబిరంలో ఇద్దరు పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్లతో పాటు గైనిక్, పిడియాట్రిక్స్, జనరల్ మెడిసిన్, ఇతర స్పెషాలిటీల నుంచి ఇద్దరు చొప్పున మొత్తం నలుగురు వైద్యులు రోగులకు వైద్యసేవలు అందించేలా కార్యాచరణ రూపొందించారు. తొలివిడతగా గత ఏడాది సెప్టెంబర్ 30న మొదలై 45 రోజుల పాటు మహాయజ్ఞంలా సాగిన ఈ కార్యక్రమంలో జిల్లాలోని విలేజ్ క్లినిక్‌లు, పట్టణ ఆరోగ్య కేంద్రాల పరిధిలో 447 వైద్యశిబిరాలు నిర్వహించారు. రక్తం, మూత్రం, ఈసీజీ తదితర 14 రకాల వైద్య పరీక్షలతో పాటు 172 రకాల మందులను అందుబాటులో ఉంచారు. 264 మంది స్పెషలిస్ట్ వైద్యులు, 132 మంది మెడికల్ ఆఫీసర్లు, ఇతర ఆరోగ్య సిబ్బంది 3.54 లక్షల మందికి వైద్యసేవలు అందించారు. 3.46 లక్షల మందికి అవసరమైన వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. శస్త్రచికిత్సలు అవసరమైన 1,678 మందిని వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పథకం కింద ఉచిత వైద్య చికిత్సలు నిర్వహించారు.

ఎన్నికలు తరువాతా శిబిరాలు

తొలిదశ విజయవంతం కాగా జనవరి 3వ తేదీ నుంచి రెండో దశ మొదలైంది. ఆరు నెలల పాటు గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో వైద్య సేవల నిర్వహణకు ముందుగానే షెడ్యూల్ నిర్ణయించింది. ఎన్నికల షెడ్యూల్ విడుదలైన నిరాటంకంగా శిబిరాల నిర్వహణ సాగింది. ఎన్నికల ముగిసిన తర్వాత కూడా షెడ్యూల్ మేరకు పలుచోట్ల వైద్య శిబిరాలు నిర్వహించి ప్రజలకు వైద్యసేవలు అందించారు. రెండో విడతగా జిల్లాలోని గ్రామీణ ప్రాంతాల్లో 223, పట్టణ ప్రాంతాల్లో 69 శిబిరాలు నిర్వహించారు. 1,08,518 మందికి వైద్యసేవలు అందించి 350 మందిని శస్త్రచికిత్సలకు సిఫార్సు చేశారు. కంటి సంబంధిత సమస్యలతో బాధపడుతున్న 2,006 మందికి ఉచిత కాటరాక్ట్ శస్త్రచికిత్సలు చేయించడమే కాక 25,144 మందికి కళ్లజోళ్లు సైతం అందజేశారు.

నిలిచిన సేవలు : పేదవర్గాలకు రూపాయి ఖర్చు లేకుండా స్పెషలిస్ట్ వైద్యసేవలు పొందే సౌలభ్యాన్ని సురక్ష శిబిరాలు కల్పించాయి. వైద్యులు సూచించిన వైద్య పరీక్షలు, మందులను ఉచితంగా ప్రభుత్వమే అందించేది. వ్యాధి నయం అయ్యేవరకు వైద్య సిబ్బంది వారి పర్యవేక్షణ బాధ్యతలను తీసుకునేలా కార్యాచరణ రూపొందించారు. పేదలకు వైద్య భరోసా కల్పించిన ఈ శిబిరాల నిర్వహణను కూటమి ప్రభుత్వం పక్కన పెట్టేసింది. మొన్నటి వరకు తమ సమీప ఆరోగ్య కేంద్రంలో స్పెషలిస్ట్ వైద్యసేవల్ని ఉచితంగా పొందిన గ్రామీణ ప్రాంత ప్రజలు ఇప్పుడు వాటి కోసం ఎన్నో వ్యయప్రయాసలకోర్చి పట్టణాలకు పరుగులు తీయాల్సి వస్తోంది. విషజ్వరాల విజృంభణ అధికంగా ఉన్న ప్రస్తుత తరుణంలో ఆరోగ్య సురక్ష శిబిరాలు నిర్వహిస్తే పేద వర్గాల వారికి మెరుగైన వైద్యం ఉచితంగా అందేదని పలువురు అంటున్నారు. దేశంలో ఎక్కడా లేని ఆరోగ్య సురక్ష సేవల కొనసాగింపునకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని పేదవర్గాల వారు కోరుతున్నారు.

మల్టీ స్పెషాలిటీ సేవలు అందేవి



గతంలో గ్రామాల్లో నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష క్యాంపులకు స్పెషలిస్ట్ వైద్యులు రావడం వలన మల్టీస్పెషాలిటీ వైద్యసేవలు అందేవి. ప్రస్తుతం వ్యాధుల సీజన్ అయినప్పటికీ గ్రామాల్లో శిబిరాలు నిర్వహించడం గాని, మందులు ఇవ్వడం గాని చేయడం లేదు. చిన్నపాటి జ్వరానికి కూడా అప్పు చేసి ప్రైవేటు వైద్యులను ఆశ్రయించాల్సి వస్తోంది.

– బి.రాంబాబు, కొండేపూడి

వైద్యులే గ్రామానికి వచ్చేవారు



పెద్దపెద్ద ఆస్పత్రులకు వెళ్లి వైద్యం పొందడం చాలా ఖర్చుతో కూడుకున్న పని. జగనన్న ఆరోగ్య శిబిరంలో అక్కడి పెద్ద డాక్టర్లే మా గ్రామానికి వచ్చి వైద్యం అందించేవారు. పరీక్షలు, మందులు అన్నీ ఉచితంగా ఇచ్చేవారు. ఎక్కడికి వెళ్లాల్సిన పనిలేకుండా నాణ్యమైన వైద్యం ఊళ్లోనే అందేది. ఇప్పుడు అటువంటి శిబిరాలు జరగడం లేదు.

– ఆర్.పైడమ్మ, ఎస్ఆర్‌పీ అగ్రహారం

ఇప్పుడు పట్టించుకోవడం లేదు



మా వార్డులో ప్రతి నెలా వైద్య శిబిరాలు నిర్వహించి నెలకు సరిపడా మందులు ఇచ్చేవారు. మా ఇంటి పక్కనే ఒక పేషెంట్‌ను చూసేందుకు వైద్యులు వచ్చేవారు. ఇప్పుడు వైద్యులు రావడం లేదు, శిబిరాలు కూడా నిర్వహించకపోవడంతో చాలా ఇబ్బంది పడుతున్నాం. ఇప్పుడు జ్వరాలు ఎక్కువగా ఉన్నా పట్టించుకునే వారే లేరు.

– మంగం లక్ష్మీకాంతం, పాలకొల్లు

నిన్ను నమ్మి మోసపోయాం బాబూ

- ఆకివీడు అయిభీమవరం రోడ్డులో ఆక్రమణల పేరుతో ఇళ్ల తొలగింపునకు యత్నంపై ధర్నాకు దిగిన బాధితులు
- సీఎం చంద్రబాబు రోడ్డుపాలు చేశారంటూ ఆవేదన



ఆకివీడు అయిభీమవరం రోడ్డులో ధర్నాలో చంద్రబాబుపై మండిపడుతున్న వృద్ధురాలు

సాక్షి, భీమవరం: నిన్ను నమ్మి మోసపోయాం బాబూ.. నమ్మి ఓట్లు వేస్తే రోడ్డు పాలు చేయిస్తావా అంటూ నిరుపేదలైన మహిళలు, వృద్ధులు వాపోయారు. మంగళవారం ఆకివీడు అయిభీమవరం రోడ్డులో ఆక్రమణల తొలగింపు పేరుతో అధికారులు జేసీబీలతో ఇళ్లను కూల్చివేసేందుకు సిద్ధపడగా వారిని అడ్డుకుంటూ ధర్నాకు దిగారు. జేసీబీలకు అడ్డంగా బైఠాయించి నిరసన తెలిపారు. ఓట్లు వేసి గెలిపిస్తే ఇలా చేస్తారా! ఇళ్లు తొలగించడం అన్యాయం, కనీసం గడువైనా ఇవ్వాలంటూ నినాదాలు చేశారు. బాధితులు ధర్నా చేస్తున్న సమయంలో విద్యుత్ శాఖ అధికారులు ఆక్రమణదారుల ఇళ్ల విద్యుత్ కనెక్షన్లు కట్ చేసి, మీటర్లు తీసుకుని వెళ్లిపోయారు. తొలుత ఆక్రమణ తొలగింపు ప్రాంతానికి ఎమ్మెల్యే కనుమూరు రఘు రామకృష్ణంరాజు వచ్చి పరిస్థితిని పరిశీలించారు. పంట, మురుగు కాల్వలు, రోడ్డు మార్జిన్ ప్రాంతంలో నివసిస్తున్న సుమారు 42 కుటుంబాల బాధితులు తమకు గడువు ఇవ్వాలని ఎమ్మెల్యేని బతిమిలాడారు. అయినా ఆక్రమణల తొలగింపు ఆగదూ, ఆగదూ అంటూ ఎమ్మెల్యే బిగ్గరగా బాధితులకు చెప్పారు. దుంపగడప గ్రామస్తులు తమ గ్రామానికి వచ్చే పంట కాల్వ ఆక్రమణలకు గురైందని, కలుషితనీరు తమకు చేరడం వల్ల అనారోగ్యం పాలవుతున్నామని ఆ గ్రామస్తులు చెప్పడం వల్లే ఆక్రమణల్ని తొలగించేందుకు చర్యలు తీసుకున్నట్లు బాధితులకు చెప్పారు. అనంతరం అక్కడ నుంచి ఎమ్మెల్యే తన స్వగ్రామం అయిభీమవరం వైపు వెళ్లిపోయారు. తమకు నోటీసులు ఇవ్వకుండా, గడువు ఇవ్వకుండా ఆక్రమణలు తొలగించడమేమిటని బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు. బాధితుల ఆందోళనతో పరిస్థితి రసాభాసగా మారడంతో కూటమి నాయకులు బాధితులతో మాట్లాడి వారం రోజులు గడువు ఇప్పిస్తామని, ఈ లోగా ఖాళీ చేసుకోవాలని చెప్పడంతో బాధితులు అంగీకరించారు. అయితే తమకు విద్యుత్ కనెక్షన్‌కు ఇప్పించాలని బాధితులు సీపీఎం నాయకులు పట్టుబట్టారు. ఫలితం లేకపోవడంతో బాధితులు కటిక చీకటిలో ఉండాల్సిన దుస్థితి ఏర్పడింది. వ్యాపారుల షెడ్లను తొలగిస్తామని ఎస్సై నాగరాజు, సీఐ జగదీశ్వరరావు చెప్పడంతో బాధితులు విభేదించగా, బుధవారం సాయంత్రానికి షెడ్లను స్వచ్ఛందంగా తొలగించుకుంటారని చెప్పడంతో అంగీకరించారు. సీపీఎం నాయకురాలు డోకల లక్ష్మి, పెంకి అప్పారావు, బి.వర్మ, రాంబాబు ఆందోళనలో పాల్గొన్నారు.

భగ్గేశ్వరంలో జ్వరాలపై సర్వే



భగ్గేశ్వరంలో ఓ ఇంట్లో కుటుంబ సభ్యుల ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీస్తున్న అడ్డాల ప్రతాప్‌కుమార్

సాక్షి స్పందన

పాలకొల్లు అర్బన్: వాతావరణంలో మార్పు వల్లే జ్వరాలకు కారణమని లంకలకోడేరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం మెడికల్ ఆఫీసర్ డా. అడ్డాల ప్రతాప్‌కుమార్ చెప్పారు. 'క్షీణిస్తున్న పారిశుధ్యం.. జ్వరాల భయం' శీర్షికన 'సాక్షి'లో మంగళవారం ప్రచురితమైన కథనంపై మెడికల్ ఆఫీసర్ ప్రతాప్‌కుమార్ స్పందించారు. గ్రామంలో నాలుగు బృందాలతో గ్రామంలో సర్వే చేయించారు. జ్వరంతో బాధపడి కోలుకున్న రోగులను పరీక్షించారు. గ్రామంలో పారిశుధ్యం మెరుగునకు చర్యలు తీసుకోవాలని పంచాయతీ అధికారులకు సూచించారు. ప్రస్తుతం గ్రామంలో నలుగురు జ్వరపీడితులున్నారని, వారికి ఆరోగ్య సూచనలు చేశామన్నారు. పంచాయతీ కార్యదర్శి లింగం సత్యనారాయణ, గ్రామ పెద్దలు నిల్లా వీరభద్రుడు, దొంగ బాబాయ్, ఆరోగ్య విస్తరణాధికారి గుడాల హరిబాబు పాల్గొన్నారు.

జాతీయ సమైక్యతకు క్రీడలు దోహదం



భీమవరంలో జాతీయ క్రీడాదినోత్సవ జ్యోతితో జేసీ రాహుల్‌కుమార్‌రెడ్డి తదితరులు

భీమవరం: జాతీయ సమైక్యత, మానసిక దృఢత్వం, శారీరక ఆరోగ్యాన్ని పెంపొందించేందుకు క్రీడలు దోహదపడతాయని జేసీ టి.రాహుల్‌కుమార్‌రెడ్డి అన్నారు. హాకీ క్రీడాకారుడు ధ్యాన్‌చంద్ జయంతిని పురస్కరించుకుని జిల్లా క్రీడాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో మంగళవారం భీమవరం డీఎన్నార్ కళాశాల, ఎస్‌సీహెచ్‌బీఆర్ఎం హైస్కూల్లో మూడు రోజులపాటు నిర్వహించే జాతీయ క్రీడాదినోత్సవ జ్యోతి, క్రీడా ప్రతిజ్ఞ కార్యక్రమాలను ప్రారంభించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. విద్యార్థులకు బాల్యం నుంచి క్రీడలపై తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు ఆసక్తిని పెంపొందించాలన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు క్రీడలకు ఎంతో ప్రాధాన్యత ఇస్తున్నాయని, విద్యార్థులు క్రీడల్లో రాణించాలన్నారు. జిల్లా క్రీడాభివృద్ధి శాఖాధికారి ఎం.రాజేష్ మాట్లాడుతూ మూడు రోజులపాటు వివిధ పోటీలను నిర్వహిస్తున్నామని, పోటీలలో గెలుపొందిన విజేతలకు 29న ప్రశంసాపత్రాలు అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎస్ఏ పీఓ పి.శ్యాంసుందర్, తహసీల్దార్ ఆర్.రాంబాబు, టుటౌన్ సీఐ జి.కాళీచరణ్, డీఎన్నార్ కళాశాల కార్యదర్శి గాదిరాజు సత్యనారాయణరాజు (బాబు), ఉపాధ్యక్షుడు గోకరాజు పాండురంగరాజు, జాయింట్ సెక్రటరీ కూనపరాజు రామకృష్ణంరాజు, ప్రిన్సిపల్ జి.మోజేష్, పీడీ బీవీ నర్సింహరాజు, పీఈటీలు జీపీసీ శేఖర్‌రాజు, పి.రామభద్రిరాజు, గాదిరాజు రంగరాజు పాల్గొన్నారు.

విద్యుత్ ఈఈ, డీఈఈల బదిలీ జాబితా సిద్ధం

ఏలూరు (ఆర్ఆర్‌పేట): రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల ప్రకటించిన బదిలీల మార్గదర్శకాల మేరకు ఈపీడీసీఎల్ సీఎండీ పృధ్వీతేజ్ ఇమ్మడి ఆధ్వర్యంలో తప్పనిసరిగా బదిలీలు కావాల్సిన అధికారుల జాబితాను సిద్ధం చేశారు. వివిధ స్థాయి ఉద్యోగుల జాబితాలను ఇప్పటికే ప్రకటించగా తాజాగా మంగళవారం డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ల జాబితా ప్రకటించారు. ఈ జాబితాలో ఏలూరులో ఈఈ (టెక్నికల్)గా పనిచేస్తున్న ఎం.ఝాన్సీ పేరు చోటుచేసుకుంది. అలాగే డీఈఈల జాబితాలో ఏలూరు సర్కిల్ పరిధిలో పనిచేస్తున్న 8 మంది పేర్లు ఉన్నాయి.

సొసైటీల్లో డేటా కంప్యూటరీకరణ



మొగల్తూరు సొసైటీలో కంప్యూటరీకరణను పరిశీలిస్తున్న ఏజీఎం చంద్రశేఖర్

మొగల్తూరు: జాతీయ బ్యాంకుల తరహాలోనే సొసైటీలను కంప్యూటరీకరణ చేస్తున్నామని డీసీసీబీ ఏజీఎం పి.చంద్రశేఖర్ చెప్పారు. మొగల్తూరులోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంలో కంప్యూటరీకరణ చేస్తున్న విధానాన్ని మంగళవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ జాతీయ బ్యాంకుల తరహాలోనే గ్రామీణ ప్రాంతాలలోనే సొసైటీలను కంప్యూటరీకరణ చేసేందుకు అధికారులు నిర్ణయించారన్నారు. దీనిలో భాగంగానే జిల్లాలోని సహకార బ్యాంకులన్నీ కంప్యూటరీకరణ చేస్తున్నామన్నారు. మొగల్తూరు సొసైటీ 1956లో ఏర్పడిందని, అప్పటి నుంచి ఇప్పటివరకు సొసైటీ ఖాతాదారుల వివరాలను, వారి లావాదేవీలను కంప్యూటరీకరణ చేస్తున్నామని, అక్టోబర్ 2వ తేదీ నాటికి ఈ ప్రక్రియను పూర్తి చేయాలని సిబ్బందిని ఆదేశించామన్నారు. త్వరలో ఏటీఎం మొబైల్ వాహనాలను ఏర్పాటు చేస్తున్నామని, నిర్దేశించిన ప్రాంతాలలో ఏటీఎంలను త్వరలో ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. ఇప్పటికే 4 మొబైల్ ఏటీఎం వాహనాలు ఖాతాదారులకు అందుబాటులో ఉండేలా ఏర్పాటు చేశామని వివరించారు. సొసైటీ కార్యదర్శి కొత్తపల్లి గోవింద్, సిబ్బంది పాల్గొన్నారు.

పరిశోధనకు సాంకేతికత అవసరం



సమావేశంలో మాట్లాడుతున్న ఉద్యాన వర్సిటీ వీసీ గోపాల్

తాడేపల్లిగూడెం: ఉద్యాన శాస్త్ర అధ్యయనం, పరిశోధనల్లో సాంకేతికత అవసరమని ఉద్యాన వర్సిటీ ఉపకులపతి డాక్టర్ కె.గోపాల్ అన్నారు. ఉద్యాన సాగులో సాంకేతికతపై మిశ్రమ అభ్యాస వేదిక ద్వారా నాలుగు రోజుల శిక్షణా కార్యక్రమం ఆన్‌లైన్ పద్ధతిలో మంగళవారం వెంకట్రామన్నగూడెంలోని ఉద్యాన వర్సిటీలో ప్రారంభమైంది. సాంకేతికత పరిజ్ఞానం జోడింపు ద్వారా అంతర్జాతీయ స్థాయిలో జరుగుతున్న ఉద్యాన శాస్త్ర పరిణామాలతో విద్యార్థులు సమన్వయం చేసుకోవచ్చన్నారు. ఉద్యాన విద్యార్థులు నూతన సాంకేతిక పరిజ్ఞానం పెంపొందించుకోవాలని వీసీ కోరారు. పీజీ డీన్ సూర్యకుమారి మాట్లాడుతూ మిశ్రమ అభ్యాసన ప్రక్రియ ద్వారా విద్యార్థులకు ఎంతో విజ్ఞానం లభిస్తుందన్నారు. ఉద్యాన సాగులో వస్తున్న మార్పులపై విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలన్నారు. ఐసీఏఆర్ అనుబంధ సంస్థల సమన్వయంతో ఈ శిక్షణా కార్యక్రమం నిర్వహిస్తున్నారు. ఉద్యాన కళాశాలల విద్యార్థులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఈత పోటీల్లో మోక్షితకు గోల్డ్ మెడల్


గోల్డ్ మెడల్ సాధించిన కోరశిఖ మోక్షిత

వీరవాసరం: వీరవాసరం మండలం పెర్కిపాలెం గ్రామానికి చెందిన కోరశిఖ మోక్షిత అంతర్ జిల్లా ఈత పోటీల్లో గోల్డ్ మెడల్ సాధించింది. ఈనెల 25న పల్నాడు జిల్లా నరసారావుపేట ఎస్ఎస్ అండ్ ఎన్ కళాశాలలో నిర్వహించిన ఈత పోటీల్లో వంద మీటర్ల బెస్ట్ స్ట్రోక్ విభాగంలో ఆమె ఈ ఘనత సాధించింది. దీంతో కేరళలోని త్రివేండ్రంలో సెప్టెంబర్‌లో జరిగే జాతీయస్థాయి ఇంటర్ పోల్ గేమ్ ఈత పోటీలకు అర్హత సాధించినట్టు మోక్షిత తెలిపింది. ప్రస్తుతం విష్ణు ఎడ్యుకేషనల్ సొసైటీ స్విమ్మింగ్ కోచ్ సీహెచ్ఎస్ఎస్ వర్మ ఆధ్వర్యంలో ఈతలో శిక్షణ తీసుకుంటున్నట్టు ఆమె తండ్రి వీర్రాజు తెలిపారు.

గంజాయి స్వాధీనం

పెనుగొండ: పెనుగొండ వ్యవసాయ మార్కెట్ వద్ద మూడున్నర కేజీల గంజాయిని స్వాధీనం చేసుకుని ముగ్గురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నట్లు పెనుగొండ సీఐ నక్క రజిని కుమార్ తెలిపారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ అటవీ ప్రాంతం నుంచి గంజాయిని పెనుగొండకు తరలిస్తుండగా ఏఎంసీ వద్ద వీరిని పట్టుకున్నట్లు వివరించారు. ఒరిస్సా రాష్ట్రం మల్కనగిరి జిల్లా బడఫదర్ గ్రామానికి చెందిన సానియా హంతులు, పెనుగొండకు చెందిన వాస్తవం దుర్గయ్య, పాలపర్తి చిన్ని వద్ద వీటిని స్వాధీనం చేసుకుని వారిపై తహసీల్దార్ జి అనితకుమారి, వీఆర్వోల సమక్షంలో కేసు నమోదు చేశామన్నారు సమావేశంలో ఎస్సై గంగాధర్ పాల్గొన్నారు.

మహిళ మృతదేహం లభ్యం

భీమవరం: భీమవరం టూటౌన్ పరిధిలోని ఉండి రోడ్డులో రెండు కాలువల వద్ద మంగళవారం ఉదయం మహిళ మృతదేహాన్ని గుర్తించినట్లు పోలీసులు తెలిపారు. సత్యవతి నగర్‌కు చెందిన జి.దేవి(33)గా గుర్తించినట్లు చెప్పారు. మతిస్థిమితం లేకపోవడంతో గతంలో కూడా ఆమె ఇంటి నుంచి పలుమార్లు బయటకు వెళ్లినా తిరిగి వచ్చేదని, అయితే 26వ తేదీన వెళ్లిన మృతురాలు తిరిగి ఇంటికి రాలేదని ఆమె తండ్రి ఫిర్యాదులో పేర్కొన్నట్లు తెలిపారు. ఏఎస్సై మోహనరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

భార్యపై చాకుతో దాడి

ఎల్అండ్‌టీ కాలనీలో ఉంటున్న వి.అచ్చాయమ్మను ఆమె భర్త రాంబాబు చాకుతో చేతిపై పొడిచినట్లు ఫిర్యాదు అందినట్లు పోలీసులు తెలిపారు. మద్యం తాగి వచ్చి రాంబాబు దాడి చేసినట్లు తెలిసిందన్నారు. ఏఎస్సై కోళ్ల శ్రీనివాసరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



కఠిన చట్టాలు అవసరం



ఆగిరిపల్లి: మహిళా డాక్టర్లు, వైద్య సిబ్బందితో అనుచితంగా ప్రవర్తించే వారిని శిక్షించేందుకు కఠిన చట్టాలు అమలు చేయాలి. ఇటీవల కాలంలో వైద్యులపై దాడులు ఎక్కువగా జరుగుతున్నాయి. ప్రాణాలు పోస్తున్న డాక్టర్లకే ప్రాణరక్షణ లేకపోవడం చాలా దారుణం. వైద్యుల భద్రతపై ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకోవాలి.

– డాక్టర్ మంజులాదేవి, ఆగిరిపల్లి మండలం, నగ్గూరు పీహెచ్‌సీ

ఆసుపత్రుల్లో రక్షణ ఏర్పాట్లు చేయాలి



ముగల్తూరు: గ్రామీణ ప్రాంతాలు, పట్టణ ప్రాంతాలు అనే కాకుండా ప్రతి ప్రభుత్వ ఆసుపత్రుల్లోను డాక్టర్లకు, వైద్య సిబ్బందికి రక్షణ ఏర్పాట్లు చేయాలి. ఆసుపత్రుల్లో రోగి తరఫు బంధువులం అంటూ రకరకాల వారు వస్తుంటారని, వైద్య సిబ్బందికి సరైన రక్షణ లేకపోతే ఎవరు బాధ్యత వహిస్తారన్నారు. ప్రతి ఆసుపత్రిలోనూ సరైన బందోబస్తు ఏర్పాటు చేయాలి.

– డాక్టర్ సీహెచ్ సుధాకర్, కాళీపట్నం

హత్యాచారాలపై ఆగ్రహ జ్వాల

ఏలూరు (ఆర్ఆర్‌పేట): కోల్‌కతాలో వైద్య విద్యార్థినిపై జరిగిన అత్యాచారం, హత్య ఘటనను నిరసిస్తూ సెయింట్ థెరిస్సా మహిళా కళాశాల, సెయింట్ జోసఫ్ డెంటల్ కళాశాల విద్యార్థినులు మంగళవారం నగరంలో భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సెయింట్ థెరిస్సా మహిళా కళాశాల ప్రిన్స్‌పాల్ సిస్టర్ మెర్సీ, ఐద్వా జిల్లా కార్యదర్శి ఏ. శ్యామల రాణి, డెంటల్ కాలేజ్ విద్యార్థిని వీ అంబిక మాట్లాడుతూ దేశంలో మహిళలపై దాడులను నిరోధించడంలో ప్రభుత్వాలు విఫలమౌతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. కొత్త చట్టాలు తీసుకొస్తున్నప్పటికీ సమాజంలో ప్రతిరోజు ఏదో ఒకచోట మహిళలు, చిన్నారులపై అత్యాచారాలు, హత్యలు జరుగుతూనే ఉండడం దురదృష్టకరమన్నారు. ఏలూరులో గత ఆరు నెలల్లో ఆరుగురిపై హత్య, అత్యాచార ఘటనలు వెలుగు చూశాయన్నారు. అత్యాచారాలు అరికట్టడానికి ఫాస్ట్‌ట్రాక్ కోర్టులు ఏర్పాటుచేసి దోషులకు వెంటనే కఠిన శిక్షలు పడేలా చూడాలని, నిర్భయ ఉదంతం సందర్భంగా జస్టిస్ వర్మ కమిషన్ చేసిన సిఫార్సులను రాష్ట్ర ప్రభుత్వాలు వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఆసుపత్రిలో వైద్యుల రక్షణకు తక్షణం సెక్యూరిటీని ఏర్పాటు చేయాలన్నారు. తొలుత ఈ ర్యాలీ సెయింట్ ఆన్స్ మహిళ కళాశాల నుంచి ప్రారంభమై అమీనాపేట పోలీస్ కళ్యాణ మండపం, ప్రభుత్వ ఆసుపత్రి మీదుగా ఫైర్‌స్టేషన్ సెంటర్ వరకు సాగింది. అనంతరం ఫైర్‌స్టేషన్ సెంటర్ వద్ద భారీ మానవహారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఫైర్‌స్టేషన్ సెంటర్లో మహిళలు, చిన్నారులపై జరుగుతున్న అత్యాచారాలపై విద్యార్థులు ప్రత్యేకంగా లఘు నాటికలు ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో సెయింట్ జోసెఫ్ డెంటల్ కళాశాల కరస్పాండెంట్ ఫాదర్ జీ మోజెస్, ప్రిన్సిపాల్ స్లీవ రాజు, సెయింట్ థెరిస్సా కళాశాల కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామ్స్ సుశీల, ఐద్వా జిల్లా అధ్యక్షురాలు పీ హైమావతి, డీవైఎఫ్ఐ నాయకులు పీ దుర్గాప్రసాద్, అధ్యాపక బృందం, తదితరులు పాల్గొన్నారు.


ఏలూరు ఫైర్‌స్టేషన్ సెంటర్‌లో విద్యార్థుల మానవహారం


దోషులను ఇలా శిక్షించాలంటూ.. లఘు నాటిక ప్రదర్శన


ఏలూరులో విద్యార్థుల ర్యాలీ

ఇన్సూరెన్స్ కంపెనీని మోసగించిన ఇద్దరి అరెస్ట్

కైకలూరు: మోసానికి కాదేది అనర్హం అన్నట్లుగా ఫోర్జరీ ఇన్సూరెన్స్ పాలసీలకీ సైతం కేటుగాళ్లు పాల్పడుతున్నారు. ఇటువంటి కేసును కైకలూరు పోలీసులు మంగళవారం చేధించారు. టౌన్ స్టేషన్‌లో సీఐ పి.కృష్ణ కేసు వివరాలు వెల్లడించారు. కైకలూరు ప్రాంతంలో 5 నెలల క్రితం కైకలూరు మండలం శృంగవరప్పాడు గ్రామానికి చెందిన ఘంటసాల మోహనకృష్ణ(27) తన బొలెరో వాహనంతో ద్విచక్రవాహనదారుడిని ఢీకొట్టగా అతడు మరణించాడు. దీనిపై కేసు నమోదయ్యింది. అయితే మోహనకృష్ణ తన వాహనానికి ఇన్సూరెన్స్ లేకపోవడంతో ఏలూరు ట్రాన్స్‌ఫారం వీధికి చెందిన మమిల్లపల్లి అంజనీకుమార్(39)తో కలిసి ఇన్సూరెన్స్ కోసం నకిలీ పత్రాలను తయారు చేయించారు. అకో జనరల్ ఇన్సూరెన్స్ ప్రైవేటు రంగ సాధారణ బీమా సంస్థకు చెందిన ఇన్సూరెన్స్ యాప్‌లో సంబంధిత పత్రాలను అప్‌లోడ్ చేశారు. అయితే బొలేరో వాహనానికి బదులు అల్ట్రో మారుతీగా మార్పు చేశారు. చివరకు అది నకిలీ అని తేలింది. బాధిత కుటుంబం పోలీసు ఉన్నతాధికారులను ఆశ్రయించింది. బీమా సంస్థ నిర్వాహకులు కూడా జరిగిన మోసాన్ని గ్రహించి ఈ నెల 24న కైకలూరు పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. జిల్లా ఎస్పీ ఆదేశాలతో బృందాలతో విచారణ చేపట్టి మోసగాళ్లను పట్టుకున్నామని సీఐ తెలిపారు. నకిలీ డాక్యుమెంట్లతో అకో జనరల్ ఇన్సూరెన్స్ కంపెనీ, పోలీస్, ఆర్‌టీవో, ఎంవీఐలను తప్పుదోవ పట్టించినట్లు నిర్ధారణ అయ్యిందన్నారు. పోలీస్, ఆర్టీఏ అధికారులు వాహనాలు చెకింగ్ చేసేటప్పుడు సదరు తప్పుడు డాక్యుమెంట్‌నే ఒరిజినల్ డాక్యుమెంట్‌గా చూపిస్తూ, తక్కువ డబ్బుతో ఎక్కువ డబ్బు గల పాలసీని తయారు చేసి మోసాలు చేసినట్లు గుర్తించామన్నారు. చీటింగ్ కేసు నమోదు చేసి ఇద్దరిని అరెస్టు చేసి కోర్టుకు తరలించామన్నారు. మరో వ్యక్తిని అదుపులోకి తీసుకోవాల్సి ఉందన్నారు. కార్యక్రమంలో టౌన్ ఎస్ఐ ఆర్.సత్యనారాయణ, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.


పట్టుబడ్డ నిందితులతో కైకలూరు టౌన్ పోలీసు స్టేషన్ వద్ద వివరాలు వెల్లడిస్తున్న సీఐ కృష్ణ

స్కూటీని దొంగిలించబోయి..

ద్వారకాతిరుమల: స్కూటీని దొంగిలించబోయిన ఓ వ్యక్తి ఆ ఇంటి సభ్యుల కంట పడడంతో అతడిని స్తంభానికి కట్టేసి అనంతరం పోలీసులకు అప్పగించారు. స్థానికుల కథనం ప్రకారం. ద్వారకానగర్‌కు చెందిన గాంచి తానారామ్ ఇంటికి సోమవారం అర్ధరాత్రి 12 గంటల సమయంలో ఒక దొంగ వచ్చాడు. ఇంటి ఆవరణలోని స్కూటీని దొంగిలిస్తుండగా తానారామ్ కుమారుడు సంజు, మేనల్లుడు రాజేష్ అతడిని పట్టుకున్నారు. చుట్టుపక్కల వారంతా కలిసి దొంగను స్తంభానికి కట్టేసి, పోలీసులకు సమాచారం అందించారు. తొలుత భీమడోలు పోలీసులు ఘటనా స్థలానికి చేరుకున్నారు. అయితే ఘటన జరిగిన ప్రదేశం ద్వారకాతిరుమల మండల పరిధిలోనిది కావడంతో దొంగను స్థానిక పోలీస్ స్టేషన్‌కు తరలించారు.


ద్వారకానగర్‌లో స్తంభానికి కట్టివేసి ఉన్న దొంగ

ఖరీఫ్ ధాన్యం కొనుగోలుకు సిద్ధంగా ఉండాలి

జాయింట్ కలెక్టర్ ధాత్రి రెడ్డి

ఉంగుటూరు: ఖరీఫ్ సీజన్‌లో ధాన్యం కొనుగోళ్లకు ముందస్తుగా అధికారులు సిద్ధంగా ఉండాలని జిల్లా జాయంట్ కలెక్టర్ ధాత్రి రెడ్డి అన్నారు. నారాయణపురంలో సొసైటీని, నాచుగుంటలోని గాయత్రి ట్రేడర్స్ రైసు మిల్లు, నారాయణపురం రైతు సేవా కేంద్రాన్ని జేసీ మంగళవారం పరిశీలించారు. గాయత్రి రైస్ మిల్లు స్టోరేజీ కెపాసిటీ, తేమ శాతం కొలిచే యంత్రాలను, బ్లెండింగు మెషీన్ పని తీరు, గోనె సంచుల నిల్వల వివరాలను అడిగి తెలుసుకున్నారు. సంబంధిత రైసు మిల్లుల్లో 70 వేల గోనె సంచులు అందుబాటులో ఉండగా వాటిన్నింటిని ధాన్యం కొనుగోలుకు అనువుగా ఉండేలా చూడాలని ఆదేశించారు. బ్యాంకు గ్యారంటీ సిద్ధం చేసుకోవాలని రైసు మిల్లు యాజమన్యానికి జేసీ సూచించారు. నారాయణపురం రైతు సేవా కేంద్రాన్ని పరిశీలించిన సందర్భంగా అక్కడ ఉన్న రైతులతో ధాన్యం కొనుగోలు విషయంపై చర్చించారు. ముందుగా మినీ మిల్లర్లు తేమ శాతాన్ని పరిశీలించుకోవాలన్నారు. సొసైటీని పరిశీలించిన జేసీ ధాత్రి రెడ్డి కంప్యూటరీకరణ తీరును కూడా పరిశీలించారు. ఖరీఫ్ ధాన్యం కొనుగోలు కార్యకలాపాలకు సంబంధించి సొసైటీ అధికారులు, సిబ్బందితో సమీక్షించారు. ఉంగుటూరు తహసీల్దార్ కార్యలయాన్ని కూడా ఆమె పరిశీలించారు. ఆమె వెంట డీఎస్‌వో ఆర్ఎస్ఎస్ రాజు, జిల్లా సివిల్ సప్లయ్ మేనేజర్ మంజుభార్గవి, డీఎస్‌వో శ్రీనివాసు, ఏడీఏ ఉషారాణి, వ్యవసాయ శాఖ ఏడీఏ ఉషారాజకుమారి, తహసీల్దార్ సతీష్ ఉన్నారు.


ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న జేసీ ధాత్రి రెడ్డి, ఇతర అధికారులు

నూరు రోజుల ప్రణాళిక లక్ష్యసాధనే ధ్యేయం

కలెక్టర్ కె.వెట్రిసెల్వి

ఏలూరు (మెట్రో): జిల్లాలోని అన్ని శాఖల అధికారులు 100 రోజుల ప్రణాళికలో నిర్దేశించిన లక్ష్యాల సాధన పూర్తి చేసేందుకు కృషి చేయాలని జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్‌లోని గౌతమీ సమావేశపు హాలులో 100 రోజుల ప్రణాళిక లక్ష్య సాధనపై జిల్లాలోని అన్ని శాఖల అధికారులతో మంగళవారం కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ వెట్రిసెల్వి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ఆయా శాఖల పరిధిలో ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో వారికి నిర్దేశించిన లక్ష్యాలను 100 రోజుల్లో పూర్తిచేయాలన్నారు. రాష్ట్ర స్థాయిలో ఏలూరు జిల్లాను నూరు రోజుల ప్రణాళిక అమలులో ముందు స్థానంలో నిలిపేలా అధికారులు పనిచేయాలన్నారు. ఈ సందర్భంగా ఆయా శాఖలు రూపొందించిన నివేదికలను కలెక్టర్ పరిశీలించి సంబంధిత అధికారులకు తగు సూచనలు చేశారు. ఈ సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి డి.పుష్పమణి, డీఆర్‌డీఏ పీడీ విజయరాజు, అటవీ శాఖాధికారులు రవిశంకర్, హిమశైలజ, డ్వామా పీడీ పి.రాము, డీఎంహెచ్ఓ డా.శర్మిష్ఠ, డీఈఓ అబ్రహం, జిల్లా వ్యవసాయశాఖాధికారి హబీబ్ పాషా, పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్ ఆదిశేషు, ఎంఐపీ పీడీ రవికుమార్, ఉద్యానవన శాఖాధికారి రామ్మోహన్, ఐసీడీఎస్ పద్మావతి, గృహనిర్మాణ శాఖాధికారి శ్రీనివాస్, ఏలూరు నగరపాలక సంస్థ కమిషనర్ ఏ.భానుప్రతాప్ పాల్గొన్నారు.


ఏలూరు కలెక్టరేట్‌లో అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్ వెట్రిసెల్వి

లక్ష్మీ నరసింహుని పంచలోహ విగ్రహం చోరీ

ఆగిరిపల్లి: జిల్లాలో ప్రసిద్ధిగాంచిన వ్యాఘ్ర లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో స్వామివారి పంచలోహ విగ్రహం చోరీకి గురైంది. మంగళవారం సాయంత్రం కొండపై ఉన్న స్వయంభు లక్ష్మీనరసింహస్వామికి పూజలు చేసేందుకు వెళ్లిన అర్చకుడు ఆలయ తలుపుల తాళాలు పగలగొట్టి ఉండడాన్ని గుర్తించాడు. ఆలయం లోపలికి వెళ్లి చూడగా వెయ్యి సంవత్సరాల చరిత్ర కలిగిన లక్ష్మీ నరసింహుని పంచలోహ విగ్రహం, స్వామివారి గంట చోరీకి గురయ్యాయని గుర్తించి ఆలయ ఈవో సురేష్ బాబుకు సమాచారం అందించారు. విషయం తెలుసుకున్న ఆలయ ధర్మకర్త, మాజీ ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు జిల్లా ఎస్పీ శివకిషోర్‌తో మాట్లాడారు. స్వామివారి పంచలోహ విగ్రహాన్ని త్వరగా తీసుకొచ్చేలా చర్యలు చేపట్టాలని కోరారు. ఎస్పీ ఆదేశాల మేరకు ఎస్సై సురేంద్ర కుమార్ సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. ఆలయ ఈవో సురేష్ బాబు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.


పంచలోహ విగ్రహం (ఫైల్)


ఆలయ తలుపులను పరిశీలిస్తున్న దృశ్యం

బాధిత దళిత నేతకు పరామర్శ

దెందులూరు: ముండూరులో టీడీపీ నేత చేతిలో దాడికి గురై చికిత్స పొందుతున్న సీనియర్ వైఎస్సార్ సీపీ దళిత నేత రాచూరి బాలస్వామిని మంగళవారం ఎంఆర్‌పీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు తనగాల శేఖర్, ఎంఆర్‌పీఎస్ రాష్ట్ర నాయకుడు బయ్యారపు రాజేశ్వరరావు పరామర్శించారు. బాలస్వామిపై దాడిని ఖండించారు. ఈ దాడిని ఎంఆర్‌పీఎస్ రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు కృష్ణ మాదిగ దృష్టికి తీసుకువెళ్తామన్నారు. ధైర్యంగా ఉండాలని, ఎంఆర్‌పీఎస్ అండగా ఉంటుందన్నారు.

పురుగు మందుల పిచికారీ.. తస్మాత్ జాగ్రత్త

చింతలపూడి: చీడ పీడల నివారణకు మెట్ట ప్రాంతంలోని రైతులు పురుగుమందులను పిచికారీ చేయడంలో బిజీగా ఉన్నారు. పంటలను చీడ, పీడల నుండి రక్షించుకునే ప్రయత్నంలో రైతులు కనీస జాగ్రత్తలు పాటించడం లేదు. పురుగుమందుల పిచికారీలో తగిన జాగ్రత్తలు తీసుకోకపోయినట్లయితే ఒక్కోసారి ప్రాణాలను కూడా కోల్పోయే ప్రమాదం ఉంది. పురుగుమందుల పిచికారీలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను గురించి వ్యవసాయ సబ్‌డివిజన్ అసిస్టెంట్ డైరెక్టర్ బి నాగకుమార్ రైతులకు పలు సూచనలు చేశారు. ఒక్కోసారి ఎంత అప్రమత్తంగా ఉన్నా విష ప్రభావానికి గురయ్యే ప్రమాదం ఉందని అన్నారు. మూడు రకాలుగా పురుగుమందులు శరీరంలోకి ప్రవేశించే అవకాశం ఉందన్నారు.


జాగ్రత్తలు పాటించకుండా దాళ్వా వరి పైరుపై పురుగు మందు పిచికారీ చేస్తున్న వ్యవసాయ కూలీ

చర్మం ద్వారా..

పురుగుమందులు పిచికారీ చేసే సమయంలో విషం చర్మం నుంచి శరీరంలోనికి ప్రవేశించే ప్రమాదం ఉంది. ఒంటిపై పుండ్లు, గాయాలు ఉంటే మరింత సులభంగా శరీరంలోకి ప్రవేశిస్తుంది. ఆ తరువాత ఆరోగ్యంపై తీవ్ర దుష్ప్రభావం చూపుతుంది.

ముక్కు ద్వారా..

క్రిమిసంహారక మందుల ద్వారా వెలువడే వాయువులు పీల్చడం ద్వారా విషం శరీరంలోకి ప్రవేశించి హాని కలిగిస్తాయి. తరచూ ఇదే రకంగా పీలుస్తుంటే ముక్కు కేన్సర్ వచ్చే ప్రమాదం అధికంగా ఉంది.

నోటి ద్వారా..

పురుగుమందులు పిచికారీ చేశాక చేతులు శుభ్రంగా కడుక్కోకుండా ఆహార పదార్థాలు భుజిస్తే నోటి ద్వారా విష పదార్థాలు శరీరంలోకి వెళ్లే ప్రమాదం ఉంది. ఒక్కొక్కప్పుడు మందు ప్రభావం ఎక్కువయ్యి విషమించి మరణం కూడా సంభవిస్తుంది.

చికిత్స ఇలా..

చర్మం ద్వారా విష పదార్థాలు శరీరంలోకి ప్రవేశిస్తే వెంటనే సబ్బు, మంచినీటితో శుభ్రంగా కడగాలి. ఒక వేళ కళ్లల్లో పడినా మంచినీటితో కడగాలి. చికిత్స కోసం వెంటనే దగ్గరలోని వైద్యుణ్ణి సంప్రదించాలి. ముక్కుతో కనుక పీల్చితే విష ప్రభావానికి గురైన వ్యక్తిని గాలి, వెలుతురు బాగా వచ్చే ప్రదేశంలో ఉంచాలి. శ్వాస తీసుకోవడం కష్టంగా ఉంటే వెంటనే కృత్రిమ శ్వాస అందించాలి. వీలైనంత త్వరగా వైద్యుని వద్దకు తీసుకువెళ్లి చికిత్స అందించే ఏర్పాటు చేయాలి. క్రిమి సంహారక మందు నోటిద్వారా కడుపులోకి వెళితే వాంతి చేయించే మార్గాలను అన్వేషించాలి. గ్లాసుడు నీళ్లల్లో ఉప్పు లేదా ఆవాల పొడిని తగిన మోతాదులో కలిపి తాగించాలి. కడుపు ఖాళీ అయ్యే వరకు ఇలా తాగిస్తూ ఉండాలి. వెంటనే వైద్యుణ్ణి సంప్రదిస్తే తగిన చికిత్స అందించి ప్రాణాపాయం నుంచి రక్షించవచ్చు. క్రిమి సంహారక మందు పిచికారీ సమయంలో శరీరంపై నిండా దుస్తులు ధరించి, ముక్కుకు, నోటికి గుడ్డ మాస్క్ ధరించాలి. లేదా సేఫ్టీ సూట్ ధరించి పిచికారీ చేయడం మంచిది.


బి నాగకుమార్, అసిస్టెంట్ డైరెక్టర్, వ్యవసాయ సబ్‌డివిజన్

ఉత్సాహంగా ఆటల పోటీలు

ఏలూరు రూరల్: హాకీ మాంత్రికుడు ధ్యాన్‌చంద్ పుట్టినరోజు పురస్కరించుకుని జాతీయ క్రీడా దినోత్సవంలో భాగంగా జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ ఆటల పోటీలు నిర్వహించింది. మంగళవారం ఉదయం ఏలూరు అల్లూరి సీతారామరాజు స్టేడియంలో జరిగిన షాట్‌పుట్, రన్నింగ్ పోటీల్లో మహిళలు సాయ్ సెంటర్ క్రీడాకారులు పాల్గొన్నారు. స్థానిక భిశ్వనాథ్ భర్తియా స్విమ్మింగ్ పూల్‌లో బాలబాలికలకు కోచ్ గణేష్ స్విమ్మింగ్ పోటీలు చేపట్టారు. ఏలూరు కస్తూరిబా బాలికల పాఠశాలలో పీడీలు కె మురళీకృష్ణ, గవ్వ శ్రీనివాస్ బాస్కెట్‌బాల్ పోటీలు, ఇండోర్ స్టేడియంలో పురుషుల బాస్కెట్‌బాల్ పోటీలు నిర్వహించారు. బుధవారం సైతం ఇండోర్ స్టేడియంలో రెవెన్యూ, మునిసిపల్, ఆరోగ్య తదితర శాఖల ఉద్యోగులకు పోటీలు చేపడతామని డీఎస్‌డీఓ బి శ్రీనివాస్ చెప్పారు. 27, 28 తేదీల్లో పోటీల్లో గెలుపొందిన వారికి మెడల్స్, సర్టిఫికెట్లు అందిస్తామన్నారు.


స్విమ్మింగ్ పోటీల్లో పాల్గొన్న దృశ్యం

క్లుప్తంగా

పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలి

తాడేపల్లిగూడెం (టీఓసీ): కేంద్ర ప్రభుత్వం ఇటీవల ప్రకటించిన ఏకీకృత పింఛన్ విధానాన్ని (యూపీఎస్)ఏటీఎఫ్ సంఘం వ్యతిరేకిస్తోందని అధ్యక్షుడు ప్రకాశం, కార్యదర్శి నారాయణలు అన్నారు. మంగళవారం స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ పాత పింఛన్ విధానాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ పాఠశాల ప్రమాణాలపై ప్రభావం చూపుతున్న జీఓ117ను రద్దు చేయాలన్నారు. కేంద్ర ప్రభుత్వం తన నిర్ణయాన్ని ఉపసంహరించుకోకపోతే పాత పెన్షన్ విధానంపై పోరాటాలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

పెదతాడేపల్లి పంచాయతీ వార్డు మెంబర్ చందు మృతి


చందు (50)

తాడేపల్లిగూడెం రూరల్: మండలంలోని పెదతాడేపల్లి పంచాయతీ వార్డు మెంబర్ పసుమర్తి చంద్రశేఖర్ (చందు -50) గుండెపోటుతో మృతి చెందారు. కజకిస్తాన్ విహార యాత్రలో ఉండగా గుండెపోటు రావడంతో ఆయన తుది శ్వాస విడిచారు. ఈయనకు భార్య సుమలత, కుమారుడు రాజా, కుమార్తె కలరు. ఆయన మృతికి ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్, టీడీపీ నియోజకవర్గ ఇన్చార్జ్ వలవల బాబ్జీ, గ్రామ సర్పంచ్ పోతుల అన్నవరం, వాసవి ఇంజనీరింగ్ కళాశాల డైరెక్టర్ చలంచర్ల మురళీ, జనసేన నాయకుడు దాగారపు నాగు తదితరులు సంతాపం తెలిపారు.

పోలీసు సిబ్బందికి ఉచిత రక్త పరీక్షలు

భీమవరం: పోలీసు సిబ్బంది ఆరోగ్యంగా ఉన్నప్పుడే ప్రజలకు మరింత మెరుగైన సేవలను అందించగలరని నిత్యం ఆరోగ్యంపై అప్రమత్తంగా ఉండాలని భీమవరం టూటౌన్ సీఐ జి కాళీచరణ్ అన్నారు. మంగళవారం సీఐ కాళీచరణ్ ప్రోత్సాహంతో టుటౌన్ పోలీసు సిబ్బందికి ఉచిత రక్తపరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ కాళీచరన్ మాట్లాడుతూ పోలీసు విధి నిర్వహణలో ఎన్నో ఒడిదుడుకులు ఎదుర్కొంటారని ఇలాంటి సమయంలో ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. పని ఒత్తిడిలో పడి ఆరోగ్యం పట్ల శ్రద్ధ చూపరనే ఉద్దేశంతో తానే చొరవ తీసుకుని రక్తపరీక్షలు చేయిస్తున్నట్లు చెప్పారు. రక్త పరీక్షలు రిపోర్టులు ఆధారంగా వైద్యులను సంప్రదించి వైద్య సహాయం అందించడానికి కృషిచేస్తామని కాళీచరణ్ చెప్పారు.

ఘనంగా మదర్‌థెరిస్సా జయంతి

పాలకొల్లు అర్బన్: మదర్‌థెరిస్సా బాటలో చిరు అభిమానులు సేవా కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమని రూరల్ సీఐ గుత్తుల శ్రీనివాస్ అన్నారు. పాలకొల్లు మండలం పెదమామిడిపల్లిలో మంగళవారం మదర్‌థెరిస్సా జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ముందుగా సీఐ శ్రీనివాస్ మదర్‌థెరిస్సా విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. మదర్ థెరిస్సా సేవా సమితి అధ్యక్షుడు చేబ్రోలు కృష్ణమోహన్ ఆధ్వర్యంలో గ్రామంలోని 150 మంది మహిళలు చీరలు పంపిణీ చేశారు. అలాగే ఎక్కువ సార్లు రక్తదానం చేసిన వీరా భాస్కర్, మద్దాల గణేష్, గ్రామంలోని రక్తదాతలకు సీఐ చేతుల మీదుగా సత్కరించి జ్ఞాపికలు బహూకరించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర చిరంజీవి యూత్ అధ్యక్షుడు తులా రామలింగేశ్వరరావు, జిల్లా అధ్యక్షుడు కోపల్లి శ్రీనివాస్, శిడగం సురేంద్ర, మల్లిపూడి జగదీష్, పరిమి వెంకట నవీన్, కడలి స్వామి వెంకటాద్రి పాల్గొన్నారు.

బాలికల ఎదుగుదలపై శ్రద్ధ అవసరం

ఉండి: కిశోర బాలికల ఎదుగుదలపై ప్రతి తల్లీ ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని ఐసీడీఎస్ యండగండి సెక్టార్ సూపర్‌వైజర్ నిర్మల అన్నారు. మంగళవారం మహదేవపట్నంలోని రామచంద్రాపురం అంగన్‌వాడీ కేంద్రంలో బేటీ పడావో బేటీ బచావో కార్యక్రమంలో భాగంగా కిశోర బాలికల ఎదుగుదలపై తల్లులకు అవగాహన కల్పించారు. ఆడబిడ్డ ఎదిగే సమయంలో వ్యక్తిగత పరిశుభ్రతపై వారికి అవగాహన కలిప్ంచాలన్నారు. మంచి చదవులు చదివించాలని సూచించారు. బాల్య వివాహాల వల్ల ఆడబిడ్డకు ఎన్నో ఇబ్బందులు ఏర్పడతాయని, బాల్య వివాహాలు నేరమని వివరించారు. కార్యక్రమంలో ఏఎన్‌ఎం సుబ్బలక్ష్మి, అంగన్‌వాడీ కార్యకర్త పార్వతి, పలువురు తల్లులు పాల్గొన్నారు.

గృహ నిర్మాణాలు త్వరితగతిన పూర్తి చేయాలి

కాళ్ల: ప్రభుత్వం కేటాయించిన లేఅవుట్లలో లబ్ధిదారులు గృహ నిర్మాణాలు త్వరితగతిన పూర్తి చేయాలని హౌసింగ్ ఏఈ పి.ఆంజనేయరాజు సూచించారు. కాళ్ల సచివాలయంలో గృహనిర్మాణ లబ్ధిదారులతో మంగళవారం ఆయన సమావేశం నిర్వహించారు. కాళ్ల మండలంలో ఇప్పటివరకు నిర్మాణ దశలో ఉన్న 198 గృహాలను డిసెంబర్ నాటికి పూర్తి చేయాలని అన్నారు. వచ్చే ఏడాది మార్చి నాటికి కేంద్ర ప్రభుత్వం ఈ స్కీమును క్లోజ్ చేసే అవకాశం ఉందని తెలిపారు. లేఅవుట్లలో ఇళ్లు మంజూరైన వారు వెంటనే పనులు ప్రారంభించాలని సూచించారు. గ్రామాల్లో ప్రతి ఒక్కరూ వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్మాణం చేపట్టాలన్నారు.



భద్రత కట్టుదిట్టం చేయాలి



తణుకు టౌన్: గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న పీహెచ్‌సీలో పనిచేయడం మహిళా సిబ్బందికి సవాలుగా ఉంటుంది. పీహెచ్‌సీ వద్ద సెక్యూరిటీని నియమించాలి. కోల్‌కతాలో ట్రైనీ వైద్యురాలిపై జరిగిన హత్యాచారం దారుణం. మహిళల కోసం ప్రత్యేక చట్టాలు ప్రవేశ పెట్టాలి. కచ్చితంగా అమలు చేయాలి.

– డాక్టర్ కే సాయి భవానీ, వైద్యాధికారి, వేల్పూరు. పీహెచ్‌సీ, తణుకు

పటిష్టమైన చట్టాలు తీసుకురావాలి



మహిళా వైద్యురాలిపై అత్యాచారం, హత్య దేశానికి సిగ్గుచేటు. నాగరిక సమాజానికి ఈ సంఘటన పెద్ద సవాల్. దేశంలో బాలికలపై లైంగిక దాడులు, మహిళలపై అత్యాచారాలు అనేకం జరుగుతున్నాయి. చట్టాల్లో లోపాలు వల్ల దోషులు స్వేచ్ఛగా తిరుగుతున్నారు. పటిష్టమైన చట్టాలు తీసుకురావాలి. వైద్యులకు నిర్భయంగా సేవలందించే వాతావరణం కల్పించాలి.

– యర్రమోతు త్రివేణి, అంగన్‌వాడీ కార్యకర్త, తణుకు

ముగిసిన పెళ్లి బాజాలు

- నేటితో నిలిచిన ముహూర్తాలు
- సెప్టెంబరులో శూన్యమాసం
- అక్టోబరు నుంచి తిరిగి ముహూర్తాలు

తణుకు: ఈ ఏడాది ఏప్రిల్ నుంచి సరైన ముహూర్తాలు లేక శుభకార్యాలకు బ్రేక్ పడింది. దీంతో పెళ్లి బాజాలు మోగక కల్యాణ మండపాలు కళ తప్పాయి. శుభకార్యాలపై ఆధార పడ్డ వ్యాపారాలు వెలవెలబోయాయి. ఇటీవల శ్రావణ మాసం ప్రారంభం కావడంతో తణుకు నియోజకవర్గంలో పెళ్లి సందడి కొనసాగింది. హిందూ వివాహవ్యవస్థకు ప్రత్యేక స్థానం ఉంది. వివాహ సమయంలో జ్యోతిష్యం, పంచాంగం ప్రకారం, పెళ్లివంటి ముఖ్యమైన కార్యాలకు జాతకానికి ప్రాధాన్యతనిస్తారు. కొంతకాలంగా పెళ్లికి సంబంధించి ఎలాంటి శుభ ముహుర్తాలు కుదరలేదు. ఈ ఏడాది ఫిబ్రవరి, మార్చి ఏప్రిల్ నెలల్లో బ్రేక్ పడిన పెళ్లి ముహుర్తాలు రెండు నెలల విరామంతరువాత జూలై, ఆగస్టు, నవంబర్, డిసెంబర్ నెలల్లో శుభముహూర్తాలు ఉన్నాయి. దీంతో పెళ్లిళ్లు చేసుకునేందుకు యువత ఉత్సాహం చూపుతోంది. మరో పక్క నూతన గృహప్రవేశాలు, గృహ నిర్మాణాలకు శంకుస్థాపనలు జోరుగా సాగాయి.

మరోసారి శూన్యమాసం

ఈ నెల 7వ తేదీ ప్రారంభమైన ముహూర్తాలు 28 వరకు కొనసాగుతున్నాయి. అయితే వచ్చే నెల సెప్టెంబర్ 4వ తేదీ నుంచి మరోసారి శూన్యమాసం రానుంది. భాద్రపదమాసం సైతం శూన్యమాసం కావడంతో శుభకార్యాలు తలపెట్టే అవకాశం లేదు. ఏడాది చివర డిసెంబర్‌లో మార్గశిరమాసం కావడంతో పెళ్లిళ్లకు అనుకూలంగా ఉన్నా బలమైన ముహుర్తాలు లేవని పండితులు చెబుతున్నారు.

కల్యాణ మండపాలకు డిమాండ్...

అక్టోబర్ నుంచి ముహూర్తాలు అధికంగా ఉండటంతో కల్యాణ మండపాలకు డిమాండ్ కూడా పెరిగింది. అదేరీతిలో షామియానాలు, వంటవాళ్లకు, క్యాటరింగ్ పరిశ్రమ కూడా ఊపందుకుంది. బలమైన ముహూర్తాలు ఉండే రోజుల్లో డిమాండ్ ఉండటంతో ఇన్నాళ్లు కల్యాణమండపాలు కళకళలాడాయి. అదేవిధంగా వీడియోగ్రాఫర్లు, ఫొటో గ్రాఫర్లు, పురోహితులను మాట్లాడుకుని సిద్ధం చేసుకున్నారు. శ్రావణ మాసంలో ఉన్న కొద్దిపాటి ముహూర్తాలు కావడంతో ముఖ్యంగా ఈనెల 22, 23 తేదీల్లో బలమైన ముహూర్తాలు కావడంతో తణుకు నియోజకవర్గంలో వందకు పైగా జంటలు ఒక్కటయ్యాయి. పెళ్లి శుభకార్యాల్లో సైతం సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన బంధువులు కలుసుకున్నారు. రైలు, బస్సు సర్వీసులకు రిజర్వేషన్లు చేసుకోవడంతో ప్రయాణాలు సైతం భారంగా మారాయి.

కళకళలాడిన వస్త్ర, బంగారు దుకాణాలు...

శుభకార్యాలతో వ్యాపారాలు జోరుగా సాగాయి. వస్త్రాలు, బంగారు ఆభరణాలు కొనుగోళ్లతో దుకాణాలు ఇన్నాళ్లు సందడిగా మారాయి. మరో పక్క బంగారు ధరలు ఆకాశన్నంటుతున్నా తప్పనిసరి పరిస్థితుల్లో కల్యాణం ఖర్చుకు వెనుకాడకుండా స్తోమతకు తగిన విధంగా కొనుగోలు చేశారు. ప్రీ వెడ్డింగ్ షూట్లకు కూడా డిమాండ్ పెరిగింది. మరో వైపు కొంతకాలంగా పనులు లేక డీలాపడిన పురోహితులు, క్యాటరింగ్, షామియానాలు, కల్యాణమండపాల వారితో పాటు లైటింగ్, పూలు డెకరేషన్, ఫొటో స్టూడియోల వారికి, ఐస్క్రీం, మినరల్ వాటర్, హోటల్స్, రెస్టారెంట్లు, లాడ్జీలు, సాంస్కృతిక కళాకారులు, ఈ ముహూర్తాలలో చేతి నిండా పని దొరకటంతో ఆయా రంగాల్లో రాణిస్తున్న వారికి ఇది శుభసమయమని చెప్పవచ్చు.


కల్యాణమండపాలకు పెరిగిన డిమాండ్


ఆకర్షణీయంగా తయారు చేసిన మండపం

పెళ్లి ముహూర్తాలు

సెప్టెంబర్ : ముహుర్తాలు లేవు
అక్టోబర్: 5,6,7,9,10,11,12,13,14,16,17,20,21,23,26,27
నవంబర్: 3,7,8,9,10,12,13,14,16,17,20,21,23,26,27
డిసెంబర్: 5,6,7,8,9,10,11,14,15,16,18,20,22,23,25,26
జనవరి 2025 : 16,17,18,19,20,21,23,24,25,26,27
ఫిబ్రవరి: 2,3,6,7,12,13,14,15,16,18,19,21,23,25
మార్చి : 1,2,6,7,12
ఏప్రిల్ : 14,16,17,18,19,20,21,25,29,30

30న వాహనాలకు బహిరంగ వేలం

తణుకు: తణుకు స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట బ్యూరో పరిధిలోని ప్రొహిబిషన్, ఎక్సైజ్ నేరాలకు సంబంధించి కేసుల్లో పట్టుబడిన రెండు వాహనాలకు ఈనెల 30న బహిరంగ వేలం నిర్వహిస్తున్నట్లు సీఐ ఎం.శ్రీనివాసరావు తెలిపారు. స్టేషన్ ఆవరణలో ఉదయం 11 గంటలకు జరిగే ఈ కార్యక్రమంలో ఆసక్తి కలిగిన వారు రూ. 5 వేలు డిపాజిట్‌తోపాటు ఆధార్, పాన్‌కార్డు జిరాక్స్ కాపీలు తీసుకురావాలని కోరారు.

అక్రమ కొనుగోలుదారులను నియంత్రించాలి

తాడేపల్లిగూడెం అర్బన్ : లబ్ధిదారుల నుంచి రేషన్ బియ్యం అక్రమంగా కొనుగోలు చేస్తున్న అక్రమ కొనుగోలుదారులను నియంత్రించేందుకు కఠిన చర్యలు తీసుకోవాలని వినియోగదారుల ఫోరం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఏఆర్‌కే హనుమంతరావు కోరారు. ఈ సందర్భంగా మంత్రి నాదెండ్ల మనోహర్‌కు, చీఫ్ సెక్రటరీకు ఫోరం తరుపున లేఖ రాసినట్లు హనుమంతరావు మంగళవారం తెలిపారు. రేషన్ బియ్యం అక్రమంగా కొనుగోలు చేసి అధిక ధరకు మార్కెట్లో వినియోగదారులకు విక్రయిస్తున్నారని ఆయన ఆరోపించారు. దీంతో లబ్ధిదారులకు వినిగించుకోవాల్సిన బియ్యం తప్పు దోవ పడుతున్నయని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు.

సెల్ ఫోన్ చోరీకి యత్నం

భీమవరం: పట్టణంలోని వీరమ్మపార్కు వద్ద నడిచి వెళుతున్న ఆకివీడుకు చెందిన ఎం.అప్పారావును మాటల్లో పెట్టి ఎం.మహేష్ సెల్ ఫోన్ దొంగలించడానికి యత్నించడని పోలీసులు తెలిపారు. అడ్రస్ అడిగి వివరాలు చెప్పే సమయంలో అప్పారావు జేబులోని సెల్‌ఫోన్‌ను మహేష్ తీసుకుని పారిపోతుండగా వెంటపడి అడ్డుకోగా బ్లేడుతో దాడి చేయబోయాడు. స్థానికులు పట్టుకుని పోలీసులకు అప్పగించారు. ఈ మేరకు ఎస్సై కిరణ్ కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఎన్టీఆర్ గృహ నిర్మాణ బకాయిలు చెల్లించాలి

తణుకు టౌన్: తణుకు మండలంలో 2014–2019 మధ్య కాలంలో ఎన్టీఆర్ గృహ నిర్మాణ పథకంలో ఇళ్ల నిర్మాణం చేసుకున్న లబ్ధిదారులకు వెంటనే బకాయిలు చెల్లించాలని జిల్లా వ్యవసాయ కార్మిక సంఘం సహాయ కార్యదర్శి బళ్ల చిన వీరభద్రరావు డిమాండ్ చేశారు. మంగళవారం తణుకు తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వీరభద్రరావు మాట్లాడుతూ 2014–19 మధ్య కాలంలో తెదేపా ప్రభుత్వం ఎన్టీయార్ గృహ నిర్మాణ పథకం అమలు చేసిందని, అప్పట్లో ప్రభుత్వం అందించిన స్థలం, సొంత స్థలాల్లో పక్కా ఇళ్లు నిర్మించుకున్న లబ్ధిదారులకు రూ. 1 లక్ష 50 వేలు అందిస్తామని చెప్పిందన్నారు. కానీ అప్పట్లో ఇళ్లు పూర్తి చేసినా బకాయిలు చెల్లించలేదని, ఆ బకాయిలను ఇప్పటికైనా చెల్లించాలని డిమాండ్ చేశారు. పేదలు ఇళ్ల నిర్మాణం కోసం చేసిన అప్పులకు వడ్డీలు పెరిగిపోతున్న ప్రభుత్వం నుంచి ఇప్పటికీ సొమ్ములు అందలేదన్నారు. అనంతరం వినతి పత్రాన్ని రెవిన్యూ ఇన్‌స్పెక్టర్ భవానీకి అందజేశారు.ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి దొంగల నాగేశ్వరరావు, మండల కమిటీ సభ్యులు బండారు వెంకటేశ్వరరావు, పిండి సుబ్బారావు, కొయల మహాలక్ష్మీ, బుల్లేటి విజయకుమారి, శ్రీరాముల సత్యానారాయణ, షేక్ దర్గా బీబీ, మారం రాధాకుమారి, గుత్తికొండ అనంతలక్ష్మీ, గిద్దా సుబ్బలక్ష్మీ, నీలం రమణ, పోలిశెట్టి దుర్గ తదితరులు పాల్గొన్నారు.


తణుకు తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న లబ్ధిదారులు

దండగర్ర విద్యార్థులకు ప్రశంసా పత్రాలు


క్విజ్, పెయింటింగ్ పోటీల్లో విజయం సాధించిన దండగర్ర జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు

తాడేపల్లిగూడెం రూరల్: జాతీయ అంతరిక్ష దినోత్సవం సందర్భంగా కేంద్ర విద్యాశాఖ, ఎన్‌సీఈఆర్‌టీ దేశవ్యాప్తంగా నిర్వహించిన ఆన్‌లైన్ క్విజ్, పెయింటింగ్ పోటీల్లో తాడేపల్లిగూడెం మండలంలోని దండగర్ర జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచి ప్రశంసా పత్రాలు అందుకున్నారు. ఈ విషయాన్ని హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు సీహెచ్.చంద్రశేఖర్ మంగళవారం తెలిపారు. ఆరు నుంచి 10వ తరగతి విద్యార్థులు 50 మంది ఈ పోటీల్లో పాల్గొన్నారన్నారు. వీరిలో కే.నాగ గంగా, అర్జుల మానస, కప్పల మేఘన, మైనం నాగలక్ష్మీ, బాలిన శ్యామ్, రుద్ర వీరవెంకట రాఘవ, గజ్జల సాయి మహిధర్, హేమంత్, ఏలూరి లోకేష్, ఉపాధ్యాయులు పాల్గొన్నట్లు చెప్పారు.

నేడు డయల్ యువర్ డీఎం

తణుకు అర్బన్ : ఆర్టీసీ ప్రయాణికుల సౌకర్యార్థం బుధవారం ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు డయల్ యువర్ డీఎం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు డిపో మేనేజరు సప్పా గిరిధర్‌కుమార్ తెలిపారు. వివిధ ఎక్స్‌ప్రెస్‌లు, పల్లెవెలుగు ఇతర బస్సులకు సంబంధించి సలహాలు, సూచనలు 99592 25484 నంబరులో సంప్రదించాలని కోరారు.

విద్యార్థులకు ఉచిత బస్‌పాస్‌ల అందజేత

తణుకు అర్బన్: విద్యార్థుల సౌకర్యార్థం ఉచిత బస్ పాస్‌లు అందజేసిన మానవత సంస్థ సేవలు అభినందనీయమని తణుకు జెడ్పీ బాయ్స్ హైస్కూల్ హెచ్‌ఎం కె.పద్మావతి అన్నారు. తణుకు జెడ్పీ బాయ్స్ హైస్కూల్‌లో మంగళవారం మానవత సంస్థ ఆధ్వర్యంలో 200 మందికి ఉచిత బస్‌పాస్‌లు అందచేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులు దూరప్రాంతాల నుంచి పాఠశాలకు సమయానికి చేరుకునే క్రమంలో ఉచిత బస్ పాస్‌లు సద్వినియోగపడుతాయని అన్నారు. మానవత సంస్థ ప్రతినిధులు కఠారి శారదాదేవి అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో మానవత జిల్లా శాంతి ర్యాలీ చైర్మన్ గమిని రాంబాబు, మండల చైర్మన్ బోయపాటి రామలక్ష్మి, కన్వీనర్ ఎస్వీ సతీష్‌బాబు, కార్యదర్శి బి.రామకాశీ, కోశాధికారి అక్కిన కాశీ, ప్రతినిధులు ఆనందం మస్తాన్‌రావు, కఠారి విశ్వనాథరాజు, కె.రాజేశ్వరరావు పాల్గొన్నారు.


ఉచిత బస్ పాస్‌లు పొందిన విద్యార్థులతో మానవత సేవా సంస్థ ప్రతినిధులు

తపాల శాఖ ఆధ్వర్యంలో విద్యార్థులకు క్విజ్‌పోటీలు

తణుకు అర్బన్: తపాలా శాఖ దేశమంతా విస్తరించబడి అత్యున్నత సేవలు అందిస్తుందని తణుకు హెడ్ పోస్టాఫీసు పోస్టుమాస్టరు సీహెచ్‌వీ సుబ్బారావు అన్నారు. తణుకు ఏకేటీపీ జిల్లా పరిషత్ హైస్కూల్‌లో మంగళవారం నిర్వహించిన దీన దయాళ్ స్పర్శ యోజన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఈ కార్యక్రమం ద్వారా ప్రతిభగల విద్యార్థులకు తపాలా శాఖ ద్వారా మంచి ప్రోత్సాహం అందుతుందని స్పష్టం చేశారు. అనంతరం కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన దీన దయాళ్ స్పర్శ యోజన కార్యక్రమంలో భాగంగా పాఠశాల హెచ్‌ఎం టి.రామకృష్ణ అధ్యక్షతన విద్యార్థుల్లో తపాలా బిళ్లలు సేకరణపై అవగాహన కల్పించే క్రమంలో క్విజ్ పోటీలు నిర్వహించారు. అనతంరం క్విజ్‌లో విజేతలైన మూడు టీమ్స్‌కి పోస్టుమాస్టర్ సుబ్బారావు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, తపాలా శాఖ సిబ్బంది ఎండీ షాకీర్, డి.యజ్ఞేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.


విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న పోస్టుమాస్టర్ సుబ్బారావు, హెచ్‌ఎం రామకృష్ణ, ఉపాధ్యాయులు

సింగరాజుకు నివాళులు

తణుకు అర్బన్: ఉపాధ్యాయ ఉద్యమ రథసారధి సింగరాజు రామకృష్ణయ్య ఉపాధ్యాయ వృత్తికి ఆదర్శనీయుడని ఏపీటీఎఫ్ రాష్ట్ర పూర్వ కార్యదర్శి ఐ.రాజగోపాల్ అన్నారు. సింగరాజు 27వ వర్ధంతి సందర్భంగా తణుకు జెడ్పీ బాయ్స్ హైస్కూల్‌లో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. 43 సంవత్సరాలపాటు ఏపీటీఎఫ్ ప్రధాన కార్యదర్శిగా సేవలందించడమే కాకుండా ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి ఎంతో కృషి చేసిన మహానుభావుడు సింగరాజు అన్నారు. ఈ సందర్భంగా సింగరాజు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఏపీటీఎఫ్ నాయకులు పీవీ పెద్దిరాజు, కె.సోమేశ్వరరావు, కె.రామప్రసాద్, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.


తణుకులో సింగరాజు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఏపీటీఎఫ్ నాయకులు

డీఎన్నార్‌లో ద్విచక్రవాహనాల అమరికపై శిక్షణ

భీమవరం: స్థానిక డీఎన్నార్ ఇంజినీరింగ్ కళాశాలలో ద్విచక్ర వాహనభాగాలను అమర్చడం, విడతీయడం అనే అంశంపై రెండు రోజుల శిక్షణ తరగతులు మంగళవారం ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా యమహా షోరూమ్ సర్వీస్ మేనేజర్ ఎం.రాజశేఖర్ మాట్లాడుతూ వాహనాల్లోని ముఖ్యమైన భాగాలు, వాటి విధులు, సాధారణ సమస్యల పరిష్కారంపై విద్యార్థులు ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. ఇంజిన్‌లోని లోపాలను గుర్తించడం, ఇంజిన్ అమర్చేటపుడు తీసుకోవల్సిన జాగ్రత్తలు విద్యార్థులకు వివరించారు. అలాగే అసెంబ్లింగ్ చేసేటపుడు ×ఓశరింగ్ సెట్, ప్యాకింగ్ సెట్, ఇంజిన్ ఆయిల్ ఉపయోగించే విధానం, ఫోర్ స్ట్రోక్ ఇంజన్ హెడ్ సమగ్ర పరిశీలన, వాల్వ్ టైమింగ్ సెట్టింగ్ వంటి అంశాలపై శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యక్ష, కార్యదర్శులు జీవీ నర్సింహారాజు, గాదిరాజు సత్యనారాయణరాజు(బాబు), ఉపాధ్యక్షుడు గోకరాజు పాండురంగరాజు, ప్రిన్సిపల్ ఎం.అంజన్‌కుమార్, మెకానికల్ హెచ్‌ఓడి ఐ.హరీష్ తదితరులు పాల్గొన్నారు.


భీమవరం డీఎన్నార్‌లో విద్యార్థులకు శిక్షణ ఇస్తున్న దృశ్యం

కరెంట్ కష్టాలు తీరేదెప్పుడో..

- సిబ్బందిని నియమించక!
- వేల్పూరు విద్యుత్ సబ్‌స్టేషన్‌లో సమస్యల తిష్ఠ

తణుకు టౌన్: విద్యుత్ శాఖలో సిబ్బంది కొరత వేధిస్తోంది. వినియోగదారులు పెరుగుతున్నా ఆ స్థాయిలో సిబ్బంది నియమాకాలు చేపట్టడం లేదు. భారీ వర్షాలు, ఈదురు గాలులకు సరఫరాలో ఆటంకం కలిగితే..సిబ్బంది లేమితో పునరుద్ధరణ ఆలస్యమవుతోంది. తణుకు మండలంలో నాలుగు విద్యుత్ సబ్ స్టేషన్‌లో మొత్తం 30 వేలకు పైగా విద్యుత్ కనెక్షన్‌లు సరిపడ సిబ్బంది మాత్రమే ఉన్నారు. విద్యుత్ సిబ్బంది సామర్థ్యం సరిపోవడం లేదు. ఫలితంగా గృహ, వ్యవసాయ వినియోగదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. తణుకు మండలంలోని వేల్పూరు, పైడిపర్రు, తేతలి, దువ్వ గ్రామాల్లో 33.11కేవీ విద్యుత్ ఉప కేంద్రాలు ఉన్నాయి. 30వేలకు పైగా గృహ, వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లు ఉన్నాయి. 30మంది సిబ్బంది ఉండాల్సి ఉండగా 16మంది మాత్రమే ఉన్నారు. మండలంలో విద్యుత్ శాఖకు సంబంధించి 1 ఏఈ, 1 జేఈ, ఏఎల్‌ఎం 6 ఉన్నారు. జేఎల్‌ఎం నలుగురు ఉన్నారు. మండలంలో 800 ట్రాన్స్‌ఫార్మర్లు, 11కేవీ ఫీడర్లు 21, 33 కేవీ ఫీడర్లు 3 ఉన్నాయి. విద్యుత్ శాఖకు సంబంధించి మండలంలోని గ్రామాల్లో అవసరానికి తగిన సిబ్బంది ఉన్నప్పటికీ తణుకు మున్సిపాలిటీలో విలీన ప్రాంతాల్లో తగినంత సిబ్బంది కొరత కారణంగా ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. మండలంలోని జనాబా పరంగా పెద్ద గ్రామమైన వేల్పూరులో విద్యుత్ సిబ్బంది కొరత ఎక్కువగా ఉంది. దీనితో వేసవి కాలంలో లోఓల్టేజీ సమస్య ఎక్కువగా ఉండటంతో పాటు ప్రకృతి వైపరీత్యాల సమయంలో ఏర్పడిన విద్యుత్ సమస్యలను పరిష్కరించడానికి సమయం పడుతుంది. వేల్పూరు 5 వేల కనెక్షన్‌లు ఉన్నప్పుడు ఆరుగురు సిబ్బంది ఉంటే ఇప్పుడు 10 వేల కనెక్షన్‌లు ఉన్నప్పటికీ ముగ్గురు మాత్రమే సిబ్బంది ఉన్నారు. గ్రామంలో గతంలో తక్కువ కనెక్షన్‌లు ఉన్నప్పుడు ఎక్కువ సిబ్బంది, విద్యుత్ కనెక్షన్‌లు పెరిగినప్పుడు సిబ్బంది తగ్గడంతో పని భారం పెరిగిపోయిందని సిబ్బంది పేర్కొవడం గమనార్హం . ప్రతి గ్రామానికి ఒక జూనియర్ లైన్‌మెన్ లేకపోవడంతో పాటు విలీన ప్రాంతాలల్లో మున్సిపాలిటి సిబ్బంది నియమిస్తే విద్యుత్ సమస్య తీరుతుందని పేర్కొంటున్నారు. విలీన ప్రాంతాలైన పైడిపర్రు, వీరభద్రపురం, వెంకట్రాయపురంలో విద్యుత్ సమస్యలు పరిష్కరించేందుకు ఎమర్జెన్సీ సిబ్బంది లేకపోవడంతో సిబ్బంది భారంగా మారిందని పేర్కొంటున్నారు.


వేల్పూరు విద్యుత్ సబ్ స్టేషన్

విద్యుత్ సమస్యలు పరిష్కరించాలి



వేల్పూరులో గత కొన్నేళ్లుగా లోఓల్టేజీ సమస్య ఉంది. లోవోల్టేజీ ఏర్పడంతో పాటు విద్యుత్ కోతలు ఎక్కువగా ఉంటున్నాయి. వేల్పూరు సబ్ స్టేషన్‌లో సిబ్బంది కొరత ఎక్కువగా ఉందని అధికారులు సమాధానమిస్తున్నారు. తప్పక సిబ్బంది కొరతను తీర్చడంలేదు. ఇప్పటికైనా వేల్పూరు గ్రామంలో విద్యుత్ సమస్యలు లేకుండా తీర్చాలి.

– వాసా వెంకటేశ్వరరావు, సీపీఎం పార్టీ గ్రామ కార్యదర్శి, వేల్పూరు.

ప్రతిపాదనలు పంపించాం

వేల్పూరు విద్యుత్ సమస్యల పరిష్కాం కోసం ప్రతిపాదనలు పంపించాం. గ్రామంలో 25 ఎంవీఏ రెండు ట్రాన్స్‌ఫార్మర్లు మంజూరు చేసినా ఇంకా అందలేదు. వీటి స్థానంలో ఎక్కువ సామార్థ్యం గల ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు కోసం ప్రతిపాదనలు పంపించాం. వీటిని ఏర్పాటుచేస్తే గ్రామంలో విద్యుత్ సమస్యలు పూర్తిగా పరిష్కారిస్తాం. గ్రామాల్లో విద్యుత్ సమస్యలను సకాలంలో పరిష్కరించేందుకు అవుట్ సోర్సింగ్ సిబ్బంది అవసరం ఉంది.

– పెద్దిరాజు, విద్యుత్ ఏఈ, తణుకు మండలం

బాల్య వివాహాల నిరోధంపై అవగాహన

భీమవరం అర్బన్: బాల్య వివాహాలు చేసినా, వారికి సహకరించినా చట్టరీత్యా కఠిన శిక్షలు అమల్లో ఉన్నాయని ఎంపీడీఓ కె. వెంకటలక్ష్మి, భీమవరం ఐసీడీఎస్ ప్రాజెక్టు సీడీపీఓ టీకేవీ లక్ష్మీకాంతం హెచ్చరించారు. భీమవరంలోని మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం బాల్య వివాహ నిరోధక, పోక్సో చట్టాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకటలక్ష్మి, లక్ష్మీకాంతం మాట్లాడుతూ యువతులకు 18, యువకులకు 21 వయస్సు దాటాకే వివాహం చేయాలన్నారు. చిన్నతనంలో వివాహాలు చేయడం వల్ల తల్లి, బిడ్డకు ప్రమాదాలు జరుగుతాయన్నారు. వారి మెదడు పరిపక్వత చెందకపోవడంతో జీవితంలో సమస్యలు ఎదుర్కొనలేరని దీంతో ఆత్మనూన్యత భావాలకు లోనై దంపతుల జీవితాల్లో గొడవలకు ఆస్కారం కలుగుతుందన్నారు. గ్రామాల్లో బాల్య వివాహాలపై విధిగా అవగాహన కల్పించాలన్నారు. మహిళల అసభ్యంగా ప్రవర్తించినా, వారిపై అత్యాచారాలు, దాడులు చేసినా చట్టపరంగా కఠిన శిక్షలు అమల్లో ఉన్నాయన్నారు. మహిళలు ఆర్థిక స్వావలంబన సాధించేందుకు ప్రభుత్వం ప్రోత్సాహం అందిస్తుందన్నారు. అనంతరం గల్ఫ్‌లో ఉన్న తల్లుల పిల్లల సంరక్షణ, బాల్య వివాహ నిరోధక చట్టం–2006, పోక్సో చట్టం –2012, వన్‌స్టాఫ్‌సెంటర్‌లపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్స్, వీఆర్‌వోలు, కార్యదర్శులు, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.


మాట్లాడుతున్న భీమవరం ఐసీడీఎస్ ప్రాజెక్టు సీడీపీఓ టీకేవీ లక్ష్మీకాంతం